క్లుప్తంగా

అప్పన్న సన్నిధిలో ఐఏఎస్ అధికారి పోలా భాస్కర్



కప్పస్తంభానికి మొక్కుకుంటున్న పోలా భాస్కర్ దంపతులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామిని ఐఏఎస్ అధికారి పోలా భాస్కర్ సతీసమేతంగా గురువారం దర్శించుకున్నారు. ఆలయంలోని కప్ప స్తంభాన్ని ఆలింగనం చేసుకన్నారు. ఆయన పేరిట అర్చకులు స్వామికి పూజలు నిర్వహించారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ప్రసాదాన్ని అధికారులు అందజేశారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

పెందుర్తి: సుజాతనగర్‌లోని నాగమల్లి లేఅవుట్ 11కేవీ ఫీడర్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మల నరికివేత పనుల నిమిత్తం పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఈపీడీసీఎల్ జోన్–3 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పోలాకి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. సుజాతనగర్ సీ–1,2 జోన్, కార్మికనగర్, గిరిప్రసాద్‌నగర్ 1,2,3, వెంకటాద్రినగర్, డాక్‌యార్డ్ లేఅవుట్, టీచర్స్ లేఅవుట్, నాగమల్లి నగర్, సుజాతనగర్ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

సింహాచలం ప్రాంతంలో..

సింహాచలం: విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల దృష్ట్యా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈపీడీసీఎల్ ఈఈ పి.శ్రీనివాసరావు తెలిపారు. ప్రహ్లాదపురం, శ్రీనివాసనగర్, విరాట్‌నగర్, సింహాద్రినగర్, బాలాజీగార్డెన్స్, పాత గోశాల జంక్షన్, గొల్లనారాయణపురం తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

మద్యం విక్రయిస్తున్న వ్యక్తి అరెస్టు

సబ్బవరం: వెదుళ్లనరవలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని సబ్బవరం పోలీసులు గురువారం అదుపులోకి తీసుకున్నారు.వెదుళ్లనరవలో బోరయ్య అనే వ్యక్తి అక్రమంగా మద్యం కలిగి ఉండడంతో పాటు అమ్మకాలు చేపట్టడంతో ఏఎస్ఐ టి. రవికుమార్ సిబ్బందితో కలిసి దాడి చేసి 8 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు.

పినగాడిలో బల్లాట శిబిరంపై దాడి

- 25 మంది అరెస్ట్
- రూ.1.24 లక్షల స్వాధీనం

పెందుర్తి: మండలంలోని పినగాడి శివారు ఓ చెరువులో నిర్వహిస్తున్న బల్లాట శిబిరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం సాయంత్రం దాడి చేశారు. 25 మందిని అదుపులోకి తీసుకుని వారి వద్ద ఉన్న రూ.1.24 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. పినగాడి శివారులో గురువారం సాయంత్రం గుట్టు చప్పుడు కాకుండా బల్లాట జరుగుతుంది. దీనిపై పక్కా సమాచారం అందుకున్న టాస్క్‌ఫోర్స్ పోలీసులు ఆకస్మికంగా దాడి చేశారు. నిర్వాహకులతో పాటు ఆడుతున్న వారిని అదుపులోకి తీసుకుని వారి నుంచి నగదు, ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అనంతరం నిందితులను పెందుర్తి పోలీసులకు అప్పగించారు. సీఐ రామకృష్ణ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సిరులతల్లికి పంచామృతాభిషేకం



ప్రత్యేక అలంకరణలో కనకమహాలక్ష్మి అమ్మవారు

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో గురువారం ఘనంగా త్రికాల పంచామృతాభిషేకం జరిపారు. ఈ సేవలో 36 మంది ఉభయదాతలు పాల్గొన్నారు. ఈ పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,000 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. ఈ ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకునే ఆసక్తి గల భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు బ్రాంచ్, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806081లో చెల్లించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఈవో కె. తిరుమలేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

ముత్యమాంబను దర్శించుకుంటున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



అదీప్‌రాజ్‌కు హారతి ఇచ్చి దీవిస్తున్న మహిళలు



ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అదీప్‌రాజ్‌కు పూలతో ఆత్మీయ స్వాగతం పలుకుతున్న ప్రజానీకం



ఎంత మంది ఏకమైనా.. వైఎస్సార్‌సీపీదే విజయం

- ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్
- ముత్యాలమ్మపాలెం వేదికగా ఎన్నికల ప్రచారం ఆరంభం
- వెల్లువెత్తిన అభిమాన కెరటం
- అడుగడుగునా ఆత్మీయ స్వాగతాలు



ప్రసంగిస్తున్న ఎమ్మెల్యే అదీప్‌రాజ్



ఎన్నికల ప్రచార సభకు హాజరైన అశేష జనసందోహం

పరవాడ: ఎంత మంది కౌరవ సైన్యం ఏకమైనా మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడం తథ్యమని ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ పెందుర్తి ఎమ్మెల్యే అభ్యర్థి అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. తన ఎన్నికల ప్రచారాన్ని గురువారం ముత్యాలమ్మపాలెంలో ప్రారంభించారు. ముందుగా ముత్యమాంబ ఆలయంలో అదీప్‌రాజ్ ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఎన్నికల ప్రచారానికి గ్రామానికి విచ్చేసిన అదీప్‌రాజ్‌కు పార్టీ సీనియర్ నాయకుడు బొంది అచ్చిబాబు ఆధ్వర్యంలో ప్రజలు ఘనస్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి పూల వర్షం కురిపించారు. అడుగడుగనా నీరాజనాలు పలికారు. అనంతరం ఓపెన్‌టాప్ వాహనంపై గ్రామ నాలుగు రోడ్ల కూడలిలో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి అదీప్‌రాజ్ ప్రజలనుద్దేశించి ప్రసంగించారు. ఎన్ని పార్టీలు జతకట్టినా వైఎస్సార్ సీపీకి ఒరిగేదేమీలేదన్నారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమం, అభివృద్ధి పథకాలే శ్రీరామరక్షగా నిలుస్తాయన్నారు.

మత్స్యకారులకు సీఎం జగన్ భరోసా

మత్స్యకారుల సంక్షేమం కోసం అనేక సంక్షేమ పథకాలు అమలు చేసిన ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ముత్యాలమ్మపాలెం గ్రామ మత్స్యకారులకు ఐదేళ్లలో సంక్షేమ పథకాల ద్వారా రూ.14 కోట్లు అందించామని చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో వేట విరామ సమయంలో రూ.4 వేల ఉన్న భృతిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే రూ.10 వేలకు పెంచడం జరిగిందని చెప్పారు. 50 ఏళ్ల మత్స్యకారులకు రూ.3 వేల పింఛన్ ఇంటికి తెచ్చి అందిస్తుందన్నామన్నారు. మత్స్యకారుల అభివృద్ధికి అన్ని విధాలా సహకరిస్తానన్నారు.

ఎవరు కావాలో మీరే తేల్చుకోండి

వైఎస్సార్‌సీపీ తరఫున పోటీచేసే ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు లోకలైతే.. ప్రతిపక్షం తరఫున పోటీ చేసే అభ్యర్థులు నాన్‌లోకలన్నారు. స్థానికులు కావాలో.. నాన్‌లోకల్ వారు కావాలో మీరే నిర్ణయించుకోవాలని ఎమ్మెల్యే అదీప్‌రాజ్ కోరారు. కార్యక్రమంలో పరవాడ ఎంపీపీ పైల వెంకటపద్మలక్ష్మీశ్రీనివాసరావు, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌చార్జి అన్నంరెడ్డి అజయ్‌రాజ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బైలపూడి భగవాన్ జయరామ్, జెడ్పీటీసీ సభ్యుడు పైల సన్యాసిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి చుక్క రామునాయుడు, పార్టీ సీనియర్ నాయకులు కొటాన రాము, గండి రవికుమార్, జేసీఎస్ కన్వీనర్ వెన్నల సన్యాసిరావు, నాయకులు బొంది అచ్చిబాబు, సూరాడ మసేను, చిన మసేను, సీదు మసేను, పార్టీ నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, కార్యకర్తలు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు బుద్ధి చెప్పండి

వలంటీర్ల ద్వారా అవ్వా తాతలకు పెన్షన్లు ఇవ్వకుండా చేసిన దుర్మార్గపు ప్రతిపక్షానికి వచ్చే ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని అదీప్‌రాజ్ పిలుపునిచ్చారు. మళ్లీ అధికారంలోకి వచ్చిన వెంటనే వలంటీర్ల వ్యవస్థపై మొట్ట మొదటి సంతకం చేస్తానని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి హామీ ఇవ్వడంతో ప్రతిపక్షంలో అలజడి మొదలైందని ఎద్దేవా చేశారు. దీంతో ఏం చేయాలో పాలుపోక వలంటీర్లకు నెలకు రూ.10 వేలు ఇస్తామని ప్రతిపక్ష నాయకుల మాటలను ప్రజలు నమ్మే స్థితిలో లేరన్నారు. గంగపుత్రులకు న్యాయం చేస్తాడని గ్రామంలో ఓ వ్యక్తిని పార్టీలో చేర్చుకుంటే మత్స్యకారులకు తీరని అన్యాయం చేయడమే కాకుండా పార్టీకి తీరని ద్రోహం చేశాడన్నారు. సదరు వ్యక్తి పాల్పడిన భూదందాలు, అక్రమాలను వెలికి తీసి తగిన మూల్యం చెల్లించుకునే విధంగా చూస్తామని చెప్పారు. పెద్ద మనసుతో ఫ్యాను గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరారు.

వైభవంగా అప్పన్నకు ఆర్జిత సేవలు



స్వర్ణపుష్పాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు వైభవంగా జరిగాయి. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేసి 108 స్వర్ణ సంపెంగలతో స్వామికి అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు. ఆలయ ఏఈవో ఎస్.ఆనంద్‌కుమార్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

- శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవ మూర్తులు గోవిందరాజస్వామి,శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలో వేదికపై అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందజేశారు.

1155వ రోజుకు 'ఉక్కు' రిలే దీక్షలు



1155వ ఉక్కు దీక్షలో పాల్గొన్న పోరాట కమిటీ నాయకులు

కూర్మన్నపాలెం: స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను అడ్డుకునేందుకు, ఆంధ్ర రాష్ట్ర ప్రత్యేక హోదా సాధనకు వ్యతిరేకంగా ఉన్న రాజకీయ పార్టీలను భూస్థాపితం చేయడానికి ప్రజలు సిద్ధం కావాలని ఉక్కు పరిరక్షణ, పోరాట కమిటీ నాయకులు పిలుపునిచ్చారు. కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహారదీక్షలు గురువారం నాటికి 1155వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షల్లో స్టీల్‌పాంట్‌లోని ట్రాఫిక్, కన్‌స్ట్రక్షన్ ఆర్ఎండీ విభాగాల కార్మికులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయాన్ని విరమించే వరకు వినూత్న రీతిలో పోరాటాలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

మహిళల ఉన్నతికి పూలే బాటలు



జ్యోతిరావుపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పరవాడ: మండలంలోని గొర్లివానిపాలెం బీసీ కాలనీలో జ్యోతిరావుపూలే జయంతి వేడుకలను సీఐటీయూ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా జరిగాయి. పూలే చిత్రపటానికి సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ అంటరానితనం, కుల వ్యవస్థ నిర్మూలనతో పాటు మహిళోద్ధరణకు జ్యోతిరావు పూలే కృషి చేశారన్నారు. పూణేలో 1848లో బాలికల కోసం మొదటి పాఠశాల స్థాపించారని కొనియాడారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు వరలక్ష్మి, వరహాలమ్మ, అన్నపూర్ణ, పుష్ప, అనిత, లక్ష్మి, ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు



మండల పరిషత్ కార్యాలయంలో శిలాఫలకాలపై పేపర్లు అంటించిన అధికారులు



వంగలి విలేజ్ హెల్త్ క్లినిక్‌పై సీఎం ఫొటోకు వేసిన మాస్క్

సబ్బవరం: సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించినప్పటి నుంచి మండలంలో ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తున్నారు. ప్రభుత్వ అధికారులంతా ఎన్నికల విధుల్లో తలమునకలయ్యారు. ఎక్కడా కోడ్ ఉల్లంఘనలు జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు. రాజకీయ పార్టీల నేతలు,అభిమానులు నిబంధలు మీరవద్దని, ప్రలోభాలకు పాల్పడవద్దని హెచ్చరిస్తూ గ్రామాల్లో అధికారులు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. మండలంలోని గ్రామ సచివాలయాలు,రైతు భరోసా కేంద్రాలు,విలేజ్ హెల్త్ క్లినిక్‌లతో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాలపై ఉండే ముఖ్యమంత్రి చిత్రపటానికి మాస్కులు ఏర్పాటు చేశారు.రాజకీయ నేతల విగ్రహాలకు ముసుగులు తొడగడంతో పాటు పలు ప్రభుత్వ భవనాలపై ఉండే ప్రారంభోత్సవాల శిలాఫలకాలపై సైతం పేపర్లు అంటించి ప్రజా ప్రతినిధుల పేర్లు కనిపించకుండా జాగ్రత్త వహిస్తున్నారు.అనుమతులు లేకుండా ఎన్నికల ప్రచార ర్యాలీలు,లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేయవద్దని హెచ్చరిస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో రంజాన్



చినముషిడివాడలో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు



పెందుర్తి మసీదులో ప్రార్థనల్లో ముస్లింలు

పెందుర్తి: రంజాన్ వేడుకలను నియోజకవర్గంలోని ముస్లింలు గురువారం భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. చినముషిడివాడలోని మసీదులో ఉదయం ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. ఒకరికి ఒకరు శుభాకాంక్షలు చెప్పుకున్నారు. పెందుర్తి పాతూరులోని మసీదులోరంజాన్ వేడుకలు ఘనంగా నిర్వహించారు.

ముస్లిం పెద్దలు, పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు ముస్లింల ప్రార్థనల్లో పాల్గొని శుభాకాంక్షలు అందజేశారు.

అక్రమ మద్యంపై మరింత నిఘా



అధికారులు, సిబ్బందికి సూచనలిస్తున్న సెబ్ అసిస్టెంట్ కమిషనర్ హనుమంతరావు

మర్రిపాలెం: సార్వత్రిక ఎన్నికల్లో భాగంగా సెబ్ కమిషనర్ ఎం.రవిప్రకాష్ ఆదేశాల మేరకు సెబ్ అసిస్టెంట్ కమిషనర్ ఆర్.హనుమంతరావు గురువారం మురళీనగర్‌లోని సెబ్ గోపాలపట్నం సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. సిబ్బంది పనితీరును పరిశీలించి, సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అక్రమ మద్యంపై మరింత నిఘా పెట్టి, అప్రమత్తంగా ఉండాలని పలు సూచనలిచ్చారు. మద్యం, నగదు, డ్రగ్స్, ఇతర మత్తుపదార్థాల అక్రమ రవాణా లేకుండా నిరంతరం తనిఖీలు చేస్తూ దాడులు నిర్వహించాలన్నారు. పాత నేరస్తులను బైండోవర్ చేయాలని చెప్పారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. సమావేశంలో విశాఖ జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ ఎం.కృష్ణమూర్తి, అసిస్టెంట్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ యు.సుబ్బారావు, ఎన్‌ఫోర్స్‌మెంట్ గోపాలపట్నం సీఐ ఎల్.ఉపేంద్ర, తదితర ఇన్‌స్పెక్టర్లు పాల్గొన్నారు.

75 మద్యం సీసాల పట్టివేత



మద్యం బాటిళ్లతో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

పెదగంట్యాడ: గంగవరం పోర్టు సమీపంలో అనధికారికంగా కారులో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు గురువారం ఉదయం అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద నుంచి 75 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. గాజువాక స్టేషన్ హౌస్ ఆఫీసర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో వై.లక్ష్మణ్‌నాయుడు తెలిపిన వివరాల ప్రకారం.. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ రవిశంకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ జాయింట్ డైరెక్టర్ బి.శ్రీనివాసరావు ఆదేశాల మేరకు గాజువాక స్టేషన్ హౌస్ ఆఫీసర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో వై.లక్ష్మణ్‌నాయుడు, ఎస్ఐ ఎన్.రమ్యశ్రీ సిబ్బందితో కలసి గురువారం ఉదయం 4.45 గంటలకు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా.. గంగవరం పోర్టు సమీపంలో నెల్లిముక్కుకు చెందిన వెంపాడ చంద్రశేఖర్‌రెడ్డి అనే వ్యక్తి కారులో డ్యూటీ పెయిడ్ మద్యం విక్రయిస్తుండగా పట్టుకున్నారు. అతని నుంచి 65 మద్యం సీసాలు, 10 బీరు సీసాలు, ఒక కారు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ సుమారు రూ.2లక్షల 61 వేల 895 ఉంటుందని తెలిపారు. మద్యం విక్రయిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నారు. అతనిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

ఘనంగా లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు



శారదా పరమేశ్వరిగా లలితాంబిక అమ్మవారు



లలితాంబిక సహిత సరస్వతీ హోమంలో పాల్గొన్న భక్తులు

సబ్బవరం: ప్రముఖ ఆధ్యాత్మిక క్షేత్రం దేవీపురంలోని సహస్రాక్షి రాజరాజేశ్వదేవి ఆరాధన పీఠంలో లలితాంబిక నవరాత్రి ఉత్సవాలు మూడో రోజు గురువారం ఘనంగా నిర్వహించారు. లలితాంబిక అమ్మవారు సకల జ్ఞాన స్వరూపిణి అయిన శ్రీ శారదా పరమేశ్వరిగా భక్తులకు దర్శనమిచ్చారు. పురాణ,ఇతిహాస,వేద,ఉపనిశత్తుల వంటి సకల శాస్త్రాల మూల విద్యకు జ్ఞాన స్వరూపిణిగా శారదా పరమేశ్వరిని కొలుస్తారు.అమ్మవారు కమండలం,జపమాల,పుస్తకం,బ్రహ్మ ముద్ర ధరిణిగా దర్శనమిచ్చారు. ఈ రూపంలో అమ్మవారి దర్శించుకుంటే విద్యాభివృద్ధి,ఐశ్వర్య కటాక్షం లభిస్తాయని పురాణాలు చెబుతున్నాయి.యాగశాలలో నిర్వహించిన లలితాంబికా సహిత సరస్వతీ హోమంలో రష్యా నుంచి వచ్చిన సాధకుడు మేక్స్ పాల్గొన్నారు. గురుమాత అన్నపూర్ణమ్మ చేతుల మీదుగా అన్నప్రసాదాలు అందించారు. నాలుగో రోజు లలితాంబిక అమ్మవారు అన్నపూర్ణేశ్వరి రూపంలో భక్తులకు దర్శనమివ్వనున్నట్లు గురుమాత తెలిపారు.

అన్నమాచార్య సంకీర్తన పోటీలకు ఆహ్వానం

దాబాగార్డెన్స్: పద కవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల జయంతిని పురస్కరించుకుని శృతిలయ సాంస్కృతిక భక్తి సంగీత సేవా సంస్థ ఆధ్వర్యంలో మే 19న పోటీలు నిర్వహించనున్నట్టు సంస్థ అధ్యక్షుడు శృతిలయ ప్రభాకర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 9.30 గంటల నుంచి ద్వారకానగర్ పౌర గ్రంథాలయం వేదికగా నాలుగు విభాగాల్లో జరగనున్న అన్నమాచార్య సంకీర్తన పోటీలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు పేర్కొన్నారు. పోటీలో పాల్గొనదలిచే భక్తులు పేరు, వయసు, స్కూల్ పేరు, ఆధార్ నంబర్, సెల్ నంబర్ తెలియజేయాలని, వివరాలు వాట్సాప్ గ్రూప్ ద్వారా తెలియజేస్తామన్నారు. మే 8వ తేదీలోగా దరఖాస్తులను అందజేయాలని, వివరాలకు 98498 29297 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

మత్తుపదార్థాలకు దూరంగా ఉండాలి



యువకులతో మాట్లాడుతున్న ఆరిలోవ సీఐ గోవిందరావు

ఆరిలోవ: యువకులు మత్తు పదార్థాల జోలికి వెళ్లకుండా దూరంగా ఉండాలని ఆరిలోవ సీఐ జి.గోవిందరావు సూచించారు. రానున్న సాధారణ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిపించడానికి పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో యువతకు అవగాహన కల్పిస్తున్నారు. వారితో పాటు స్టేషన్ పరిధిలో ఉన్న రౌడీషీటర్లకు, ఆకతాయిలకు హెచ్చరికలు చేస్తున్నారు. ఈ సందర్భంగా గురువారం జోడుగుళ్లపాలెంలో స్థానిక యువకులకు సీఐ పలు సూచనలు చేశారు. ఎన్నికల వేళ కావడంతో యువకులు శాంతియుతంగా ఉండాలన్నారు. మత్తు పదార్థాలకు అలవాటు పడితే భవిష్యత్ ప్రమాదకరంగా మారుతుందన్నారు. భవిష్యత్‌లో బాగుపడడానికి మంచి మార్గంలో నడవాలన్నారు. ఆకతాయిలు, రౌడీషీటర్లు అల్లర్లలో పాల్గొన్నట్లు తెలిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.